# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## ప్రముఖ శబ్దగ్రాహకులు
## ఎస్.పి.రామనాథన్ ఎ.ఆర్. స్వామినాథన్
## ( విజయచిత్ర 1983 డిసెంబర్ సంచిక నుంచీ పునర్ముద్రణ)

**చలన చిత్రాలకు** ప్రాణప్రతిష్ట చేసేశాఖ శబ్దగ్రహణ శాఖ. ఓ శాఖలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఎస్.పి.రామనాథన్ ఎ.ఆర్. స్వామినాథన్ తమ రంగానికి సంబంధించిన కొన్ని అంశాలను ఈ శీర్షికలో వివరిస్తున్నారు.



***ఎ.ఆర్. స్వామినాథన్***

పధ్నాలుగు సంవత్సరాల క్రితం..

సినిమాలోని సౌండ్ రికార్డింగ్‌కు గల ప్రాముఖ్యాన్ని. అందులో నాకున్న ఉత్సాహాన్ని పురస్కరించుకుని విజయా ప్రొడక్షన్స్లో ఆ శాఖలో అప్రెంటీస్‌గా ప్రవేశించాను. కొంత అనుభవాన్ని సంపాయించాక తొలిసారి శబ్దగ్రాహకుడిగా నేను పని చేసిన చిత్రం 'పరోపకారం', ఆ తర్వాత సుమారు వెయ్యి చిత్రాలకు శబ్ద గ్రాహకుడిగా పనిచేశాను. పదివేల పాటలకు పైగా రికార్డ్ చేశాను. ఇవాళ ఈ స్థితిలో నేనున్నానంటే, ఆ 'క్రెడిట్' అంతా నాగిరెడ్డిగారికి, వారి కుటుంబ సభ్యులకే

చెందుతుంది. ఇంత అనుభవం సంపాయించినా, ఈ శాఖలో నేర్చుకోవాల్సింది ఇంకా చాలా వుందనే నా అభిప్రాయం. కారణం శబ్దగ్రహణం సాంకేతికంగా ఎన్నెన్నో మార్పులను సంతరించుకుంటూ, అభివృద్ధి చెందుతూనే వుంది.

సంగీతానికి భాషాభేదం లేదు. నేనెన్నో భాషల పాటలు రికార్డు చేశాను. ప్రముఖ సంగీత దర్శకులు అందరి పాటలూ నా పర్యవేక్షణలో రికార్డయ్యాయి. ఇవాళ అఖిల భారతీయ ఖ్యాతిని ఆర్జించిన ఎస్.పి బాలసుబ్రమణ్యం, తొలి సినిమా పాట( శ్రీ శ్రీశ్రీ మర్యాదరామన్న' చిత్రం కోసం ఎస్.పి.కోదండపాణి సంగీత దర్శకత్వంలో) నేనే రికార్డు చేశాను. ఆ పాట నాకు తెలిసిన వారికి వినిపించి, బాలును పరిచయం చేస్తే "ఇంత సన్నగా వున్న కుర్రాడా అంత ఘనంగా పాడాడు?" అని ఆశ్చర్యపోయారు. 'పిట్టకొంచెం...కూత ఘనం' అన్నాను.

ఒకోసారి శబ్దగ్రహణంలో చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఎదురవుతుంటాయి. వాటిని సరిదిద్దడానికి సమయస్ఫూర్తి కూడా అవసరమవుతుంటుంది. ఒక సందర్భంలో ఎస్.జానకిగారి పాటను రికార్డు చేస్తున్నాను. ఆ పాటకు మ్యూజిక్ ట్రాక్ ముందే వుంది. పాట పాడడం పూర్తయిన తర్వాత ఒక చోట 'తలుపు' అనడానికి బదులుగా 'లొలుపు' అన్నట్లుగా వినబడుతోంది. నేను ఆ సంగతి చెబితే 'నేను తలుపు అనే అన్నాను' అన్నారు జానకిగారు. రెండు మూడుసార్లు పాట విని చూస్తే, సరిగ్గా ఆమాట వచ్చేచోట మరో వాయిద్య శబ్దం కలిసిపోతూ వుండడం వల్ల అలా అవుతుందని అర్థమైంది. అప్పుడు ఆ వాయిద్యపు శబ్దాన్ని మాత్రం తీసేసి, ఆ స్థానంలో ఆ పదం సరిగ్గా వచ్చేలా చేశాను. ఆ ప్రయోగాన్ని అందరూ మెచ్చుకున్నారు.

కె.వి.మహదేవన్‌గారి సంగీత దర్శకత్వంలో 'శంకరాభరణం' వంటి గొప్ప సంగీత భరిత చిత్రానికి నా పర్యవేక్షణలోనే పాటలు రికార్డయ్యాయి. ఆ పాటలు విన్న తర్వాత "తెలుగు సినిమాలో కర్ణాటక సంగీతాన్ని ఇంత నిర్దుష్టంగా ప్రవేశపెడుతున్నారు. ఏటికి ఎదురీదినట్లవుతుందేమో" అన్న సంశయాన్ని దర్శకులు కె.విశ్వనాథ్ గారితో వెలిబుచ్చాను. "పాటలతో సినిమా చూసి అప్పుడు మీ అభిప్రాయం చెప్పండి" అన్నారాయన. ఆ చిత్రం ఘనవిజయం సాధించిన తర్వాత విశ్వనాథ్ గారిలోని ఆత్మ విశ్వాసానికి నాకు ఆశ్చర్యం కలగడమేకాక, అలాంటి చిత్రానికి పనిచేసినందుకు ఆనందం కూడా కలిగింది.

శబ్దగ్రహణశాఖ ఈనాడు ఎంతగానో అభివృద్ధి చెందింది. ఐతే, కొన్ని చిత్రాలను చూసినప్పుడు, మనవారు శబ్దానికి గల ప్రాధాన్యాన్ని సమగ్రంగా ఉపయోగించుకోలేకపోతున్నారేమోననే సందేహం నాకు కలుగుతూ వుంటుంది. సినిమా సాంకేతికంగా అభివృద్ధి చెందుతోంది. నిజమే. కానీ ఆ సాంకేతికాభివృద్ధి సృజనాత్మకంగా కూడా చిత్రాలలో కనిపించాలి. అప్పుడే మనం నిజంగా అభివృద్ధిని సాధించినట్టవుతుంది.



*ఎస్.పి.రామనాథన్*

ఏకాగ్రత, ఓర్పు – ఈ శాఖాధిపతులకు తప్పనిసరిగా వుండి తీరాలి. ఒకోసారి పదిహేను టేక్స్ తీసినా, పాట ఓకే కాదు. అలాంటి సందర్భాలలో ఏ మాత్రం సహనాన్ని కోల్పోయినా పాటకు అన్యాయం జరిగే ప్రమాదం వుంది. 'తేన్‌కిన్నం' అనే తమిళ చిత్రానికి పాట రికార్డింగ్‌లో అలా ఓర్పుకు చిన్న పరీక్షలాంటి పరిస్థితి ఏర్పడింది. ఐనా నేను సహనాన్ని కోల్పోవడం జరగలేదు. ఆ చిత్రానికి సంగీత దర్శకులు శంకర్ – గణేశ్. ఆ రోజు మధ్యాహ్నం 'లంచ్' అయిన తర్వాత రికార్డింగ్ థియేటర్‌కు వెళ్ళేసరికి నా సీట్లో ఒక చీటీ రాసి వుంది. అందులో "అన్నా.. మీకు ఎప్పుడైనా కోపం అనేది వస్తే, దయచేసి ఆ సంగతి మాకు ముందుగా తెలియజేయండి. కోపం వచ్చినప్పుడు మీరెలా వుంటారో చూడాలని చాలాకాలంగా మా కోరిక భవదీయులు శంకర్ – గణేశ్" అని రాశారు ఆ సంగీత దర్శకద్వయం. అదృష్టవశాత్తూ ఇంతవరకు నా ఓర్పుకు అంతటి కఠినమైన పరీక్ష ఏదీ రాలేదు.

విశేషమైన సాంకేతిక పరిజ్ఞానం, సహనంతోపాటు అప్రమత్తత కూడా ఈ శాఖలో చాలా అవసరం. ఒకసారి నేను గోల్డెన్ స్టూడియోలో శబ్దగ్రాహకుడిగా వున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. 'అక్కా – తంగై ' అనే తమిళ చిత్రానికి రీరికార్డింగ్ చేస్తున్నాము. ఆ రోజు 'వర్క్' పూర్తయి, అందరం ఇళ్ళకు బయల్దేరడానికి సిద్దంగా వున్నాము. నేను నా సహాయకుడితో 'ఇంటర్‌కమ్'లో 'అంతా ఓకే కదా' అన్నాను. నాకే జవాబూ రాలేదు. ఒక సహాయ దర్శకుణ్ణి పిలిచి, కాబిన్‌లోకి వెళ్ళి మా వాణ్ణి చూసి రమ్మన్నాను. ఆ సహాయ దర్శకుడు వెళ్ళిన రెండు నిమిషాల్లో కంగారుపడుతూ వచ్చి "సార్ మీవాడు 'స్విచ్' ఆన్ చేయకుండా, చాలాసేపటినుంచీ లోపల నిద్రపోతున్నాడు" అని చెప్పాడు. నాకు గుండె గుభేలుమంది. వెంటనే ఇళ్ళకు వెళ్ళిపోతూవున్న సంగీత దర్శకుణ్ణి ఆర్కెస్ట్రా వాళ్ళను పిలిపించి, రికార్డు కాని ఆ ఒక రీలుకు మళ్ళీ నేపథ్య సంగీతం లేకుండానే తయారయ్యింది. దానివల్ల చిత్రానికి ఎంత నష్టం? అంచేత శబ్దగ్రహణంలో ఏకాగ్రత, శ్రద్ధ, అప్రమత్తత కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి.

Post your comments